క్లుప్తంగా

నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్‌లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రాజేష్

జంగారెడ్డిగూడెం: ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని సీఐ పి.రాజేష్ కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం ఆటో డ్రైవర్‌లకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. మితిమీరిన వేగం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, నిబంధనలకు విరుద్ధంగా ఆటోలు నడపడం సరికాదని అన్నారు. పట్టణంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా ఆటోలను పార్కింగ్, డ్రైవింగ్ విషయంలో జాగ్రత్తలు వహించాలని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే జరిమానాలతో పాటు, జైలు శిక్షకు గురవుతారని హెచ్చరించారు. ఎస్సై ఎం.మల్లికార్జునరెడ్డి, ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ, సిబ్బంది, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్‌కి అవార్డులు



వాకర్స్ క్లబ్ సభ్యులకి మెమెంటోలు ప్రదానం చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: స్థానిక వాకర్స్ క్లబ్‌కు రెండు అవార్డులు లభించాయి. నిడదవోలు లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో ఈనెల 26వ తేదీ రాత్రి ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్‌లో కొయ్యలగూడెం వాకర్స్ క్లబ్‌కి బెస్ట్ సపోర్టింగ్ క్లబ్, బెస్ట్ జోనల్ చైర్మన్ అవార్డులు లభించాయని క్లబ్ ప్రెసిడెంట్ గెద్దం రాంబాబు తెలిపారు. క్లబ్ గౌరవాధ్యక్షుడు మట్ట సూర్యచంద్ర, క్లబ్ డైరెక్టర్ మాదేటి సత్యనారాయణ, సెక్రెటరీ ఎల్ మోహన్, తదితరులు అభినందించారు.

ఊటుకూరుకి సత్కారం



పురస్కారం అందుకున్న వరప్రసాద్

కొయ్యలగూడెం: బోడిగూడెం జెడ్పీ హైస్కూల్లో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కొయ్యలగూడెం వాసి డాక్టర్ ఊటుకూరి వరప్రసాద్ రాష్ట్రస్థాయి 'కళామిత్ర' పురస్కారానికి ఇటీవల ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో 26వ తేదీ ఒంగోలులో కళా మిత్ర మండలి ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో సాహిత్య సామాజిక కళా సేవా రంగాల్లో విశేషమైన సేవలందించిన వారిని ఈ అవార్డుకు ఎంపిక చేశారని వరప్రసాద్ సోమవారం తెలిపారు. ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో ఈ సన్మానం చేశారని వివరించారు.

కోడి వ్యర్థాల వాహనం స్వాధీనం



కోళ్ల వ్యర్థాల వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

చింతలపూడి: తెలంగాణ నుంచి జిల్లాలోని కొల్లేరుకు కోడి వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని సోమవారం చింతలపూడి పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

సేవా గుణం అలవరుచుకోవాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవరుచుకోవాలని ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. ఏలూరు స్మార్ట్ సిటీ, స్మార్ట్ ఫార్మర్స్, స్మార్ట్ ప్రొఫెషనల్స్, టౌన్ లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఈ ఏడాది జూలై నుంచి నిర్వహిస్తోన్న మధ్యాహ్నం అన్నదానానికి రామచంద్ర ఇంజినీరింగ్ కాలేజ్ సీఎస్ఈ ఏఐఎంఎల్ విభాగ విద్యార్థులు 10 రోజుల పాటు స్పాన్సర్ చేయటానికి ముందుకొచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీ శ్రీధర్ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఆసుపత్రిలోని ప్రసూతి, శిశు ఆరోగ్య కేంద్రంలో 300 మందికి ఆహారంతో పాటు వాటర్ బాటిల్, పండ్లు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎంఆర్‌డీ బలరాం, 20వ డివిజన్ ఇన్‌చార్జి జీహెచ్‌డీ ప్రసాద్, రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ ఏఐఎంఎల్ హెచ్‌ఓడీ బి.శారద, అసోసియేట్ ప్రొఫెసర్స్ పాల్గొన్నారు.

ఆటోలపై ఈ-చలానాలు రద్దు చేయాలి

ఏలూరు (టూటౌన్): ఆటోలపై ఇష్టానుసారంగా విధిస్తున్న ఈ-చలానాలను రద్దు చేయాలంటూ ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్పందనలో జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్య వేణికి, ట్రాఫిక్ సీఐ కేవీఎస్‌వీ ప్రసాద్‌లకు యూనియన్ నాయకులు వినతి పత్రం అందించారు. నగరంలో స్టాప్ లైన్ వైలేషన్ పేరుతో ఆటోలపై వేలాదిరూపాయలు ఫైన్లు విధించారని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

జంగారెడ్డిగూడెం: కార్తీక సోమవారం, పౌర్ణమిని పురస్కరించుకుని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయాన్నే ముక్కంటికి పంచామృతాభిషేకాలు, పూజలు చేశారు. మహిళలు 365 ఒత్తులు వెలిగించి దీప, సాలగ్రామ తదితర దానాలు సమర్పించారు. స్థానిక బైనేరు వాగు, పేరంపేట రోడ్డు, హైస్కూల్ రోడ్డు ప్రాంతాలు, గుహాలయంలోని ఓంకారేశ్వరస్వామిని భక్తులు దర్శించుకున్నారు. విజయదుర్గమ్మ ఆలయంలో పంచభూత మరకత లింగేశ్వరస్వామికి విశేష అర్చన అభిషేకాలు చేశారు. ఆలయంలో జ్వాలా తోరణం నిర్వహించారు. శివపార్వతులకు పల్లకి సేవా నిర్వహించారు.

పారిజాతగిరిలో..

గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానం భక్తుల గోవింద నామ స్మరణతో మార్మోగింది. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేశారు. సాయంత్రం కృత్తికా దీపోత్సవం నిర్వహించినట్టు ఈఓ రాంబాబు తెలిపారు.

57వ చండీహోమం

జంగారెడ్డిగూడెం నూకాలమ్మ ఆలయంలో 57వ చండీహోమం వైభవంగా నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వీరంపాలెం శ్రీ బాలా త్రిపుర సుందరి పీఠం ప్రతినిధి బ్రహ్మశ్రీ ఈమని శశి కుమార్ శర్మ మాట్లాడుతూ ఆలయ నిర్మాణం పూర్తయిన తర్వాత 57 నెలలుగా ప్రతి పౌర్ణమికి నిర్విఘ్నంగా చండీ హోమం నిర్వహించడం అమ్మ అపార శక్తికి నిదర్శనమన్నారు. అభయాంజనేయ భజన సమాజం వారు కోలాట సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు రాజాన సత్యనారాయణ, రామలక్ష్మి దంపతులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

మద్ది అంజన్నను లక్షార్చన

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో స్వామి వారికి లక్ష తమలపాకులతో లక్షార్చన పూజ చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉసిరి చెట్ల కింద భక్తులు కార్తీక దీపారాధన చేశారు. హనుమాన్ చాలీసా పారాయణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈఓ ఆకుల కొండలరావు, ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పాల్గొన్నారు.

టి.నరసాపురం మండలంలో..

టి.నరసాపురం: మండలంలోని శివాలయాలు కిటకిటలాడాయి. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం రాత్రి ఆలయాల వద్ద జ్వాలా తోరణాలు ఏర్పాటు చేశారు. సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు శివాలయాలకు వెళ్లి 365 వొత్తులు వెలిగించుకుని శివ నామస్మరణలో తరించారు. టి.నరసాపురం కాశీ విశ్వేశ్వరస్వామి, మక్కినవారిగూడెం భువనేశ్వరిసమేత చంద్రశేఖర స్వామి, రాజుపోతేపల్లి, మల్లుకుంట శివాలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివెళ్లారు.



జంగారెడ్డిగూడెం : చండీహోమం సందర్భంగా ఆలయంలో పూజలు



లింగపాలెం : రంగాపురం సత్యనారాయణ స్వామి సన్నిధిలో వ్రతాలు



జంగారెడ్డిగూడెం : విజయదుర్గ ఆలయంలో లింగేశ్వరస్వామి



టి.నరసాపురం: కాశీవిశ్వేశ్వరస్వామి



కామవరపుకోట: బౌద్ధ ఆరామాల వద్ద ప్రాణాచారం దీక్ష



జంగారెడ్డిగూడెం రూరల్: మద్దిక్షేత్రంలో లక్షార్చన పూజ

బౌద్ధ ఆరామాలకు భక్తుల తాకిడి

కామవరపుకోట: మండలంలోని జీలకర్రగూడెం బౌద్ధ ఆరామాలను సోమవారం భక్తులు అధిక సంఖ్యలో సందర్శించి, ధర్మ లింగేశ్వర స్వామి ఆలయం వద్ద పూజలు చేశారు. మహిళలు ప్రాణాచారం దీక్ష చేపట్టారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటుచేశారు. తడికలపూడి ఎస్సై జయ బాబు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

కుక్కునూరు: కార్తీకపౌర్ణమి సోమవారం కలిసి రావడంతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కుక్కునూరు, పెద్దరావిగూడెం శివాలయాల్లో స్వామి వారికి రుద్రాభిషేకాలు నిర్వహించారు. వేలేరు చిలకలగండి ముత్యాలమ్మ ఆలయంలో శివలింగాకారంలో దీపాలను వెలిగించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆచంట మాధవరావు ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహానికి పంచామృతాభిషేకం చేశారు.

సత్యదేవుని వ్రతాల్లో 720 జంటలు

లింగపాలెం: రెండోవ అన్నవరంగా ప్రసిద్ధిచెందిన లింగపాలెం మండలం రంగాపురంలోని సత్యనారాయణస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాగింది. ఒక్కరోజే 720 జంటలు వ్రతాలు నిర్వహించాయి. పశ్చిమగోదావరి, కృష్ణా, ఖమ్మం జిల్లాల నుంచి భక్తులు పాల్గొన్నారు. మహిళలు 108 ప్రదర్శనలు చేసి ఆలయంలో ఉన్న ఉసిరిచెట్టుకు పూజలు చేశారు.

పట్టిసం శివక్షేత్రం.. భక్తజన సంద్రం



పట్టిసం వీరేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు



పట్టిసం శివక్షేత్రంలో లక్షదీపోత్సవ కార్యక్రమం నిర్వహించిన దృశ్యం



పట్టిసం శివక్షేత్రం వైపు లాంచీ ఎక్కేందుకు క్యూలైన్‌ను కంట్రోల్ చేస్తున్న పోలీసులు

పోలవరం రూరల్: కార్తీక పౌర్ణమి సందర్భంగా పోలవరం మండలం పట్టిసం శివక్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. తెల్లవారుజాము నుంచి వేలాది మంది భక్తులు గోదావరి నదిలో స్నానమాచరించి భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయం ప్రాకారంలో సామూహిక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాసం ఉన్న భక్తులు క్షేత్రం వద్ద శివనామస్మరణతో గడిపారు. క్షేత్రానికి వచ్చిన భక్తులకు దైవదర్శనంతో పాటు భోజన వసతి కల్పించే విషయంలో కూడా దేవస్థానం ఈఓ ఎస్ సంగమేశ్వర శర్మ ఏర్పాట్లు చేశారు. శివక్షేత్రం వద్ద పౌర్ణమి సందర్భంగా లక్షదీపోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాకారం చుట్టూ మహిళలు దీపాలను వెలిగించి పూజలు చేశారు. లక్షపత్రి పూజ చేశారు. పోలవరం సీఐ కె.విజయబాబు ఆధ్వర్యంలో పోలీసులు ఉదయం నుంచి రాత్రి వరకు యాత్రికులు నది దాటే ప్రదేశంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

శివయ్యకు విశేష అభిషేకాలు



స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతున్న శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయంలో రెండో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని శివదేవునికి విశేష అభిషేకాలు నిర్వహించారు. ముందుగా దేవస్థానం సిబ్బంది ఆలయాన్ని సుగంధ భరిత పుష్ప మాలికలతో శోభాయమానంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచే ఆలయానికి శివ దీక్షాధారులు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారికి విశేష అభిషేకాలు, పూజాదికాలను జరుపుకున్నారు. అలాగే ఆలయ ప్రాంగణంలో ఉన్న ఉసిరి చెట్ల వద్ద మహిళలు కార్తీక దీపాలను వెలిగించి తమ భక్తిప్రపత్తులను చాటారు. ఆలయ గర్భాలయంలో కొలువైన శివదేవుని లింగస్వరూపానికి ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛరణల నడుమ క్షీరాభిషేకాలు నిర్వహించి, హారతులిచ్చారు. ఆలయ ఆవరణలో ఉన్న శివలింగానికి భక్తులు అభిషేకాలు జరిపారు. రాత్రి గంగా, పార్వతీ సమేత శివదేవుడు రుద్రాక్ష మండప వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు.

సమాజ సేవలో ఫ్రెండ్స్ దివాళి యూత్

కొయ్యలగూడెం: సమాజ సేవలో కన్నాపురంలోని ఫ్రెండ్స్ దివాళి యూత్ ఆదర్శంగా నిలిచింది. గ్రామంలోని సుమారు 15 మంది యువకులు 2019వ సంవత్సరంలో బృందంగా ఏటా దీపావళికి బాణసంచా దుకాణం నిర్వహిస్తున్నారు. విక్రయాల్లో వచ్చిన రాబడిలో పెట్టుబడి పోను మిగిలిన మొత్తం గ్రామాభివృద్ధికి వెచ్చిస్తున్నారు. తొలి రెండేళ్లలో వచ్చిన రూ.లక్షా 70 వేలు సత్యసాయి వాటర్ ట్యాంక్, అనంతరం రూ.లక్షా 50 వేలు తూర్పుకాలువ కల్వర్టుపై ఇరువైపులా డివైడర్ పోల్స్ ఏర్పాటుకు ఖర్చు చేశారు. పీఆర్‌గూడెం రోడ్డులోని అభయాంజనేయ స్వామి ఆలయ వద్ద రూ.1,30,000తో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ ఏడాది రూ.1,50,000 గ్రామాభివృద్ధికి వెచ్చించనున్నట్టు యూత్ చెబుతున్నారు. ఈ సందర్భంగా కన్నాపురం సర్పంచ్ ఉప్పల పద్మావతి మాట్లాడుతూ ఫ్రెండ్స్ దివాళి యూత్ గ్రామాభివృద్ధికి సహకరిస్తున్నట్టు చెప్పారు. వీరికి గ్రామంలో దీపావళి బాణసంచా నిర్వహణకు ఒక షాపునకు అనుమతిని ఇస్తూ ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు.

జంగారెడ్డిగూడెం వాసికి డాక్టరేట్

జంగారెడ్డిగూడెం: డీడబ్ల్యూపీ ఇంటర్నేషనల్ కంపెనీ, ఇండియా విభాగం సీఈఓ, జంగారెడ్డిగూడెంకు చెందిన నడింపల్లి నాని రాజు నేషనల్ అమెరికన్ యూనివర్సిటీ నుంచి ఈనెల 26న గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. సర్దార్ వల్లబాయ్ పటేల్ యూనివర్సిటీ మెమెంటోతో సత్కరించింది. స్వాతంత్ర్యోద్యమ విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు దేశ భక్తి, సేవా నిరతిని ప్రపంచానికి తెలిపేలా చేస్తోన్న కృషికి నానిరాజును డాక్టరేట్ వరించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల క్షత్రియ సేవా సమితి ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న నానిరాజు అల్లూరి సీతారామరాజు ఔనత్యాన్ని తెలిపేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అల్లూరి పుట్టిన ఊరు, విద్యాభ్యాసం చేసిన ఊరు, పోరాటాలు చేసే సమయంలో తిరిగిన ప్రాంతాలను అల్లూరి స్మృతి ప్రాంతాలుగా తీర్చిదిద్దనున్నట్టు చెప్పారు.

జాబ్ మేళా పోస్టర్ విడుదల



జాబ్ మేళా పోస్టర్ విడుదల చేసిన ఎమ్మెల్యే బాలరాజు, తదితరులు

బుట్టాయగూడెం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 30న నిర్వహించే మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని దుద్దుకూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాఫ్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన జాబ్‌మేళా పోస్టర్‌ను సోమవారం బాలరాజు విడుదల చేశారు. పోలవరం నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించేందుకు సుమారు 18 కంపెనీలు పాల్గొంటున్నాయని బాలరాజు చెప్పారు. ఐటీడీఏ పీఓ ఎం సూర్యతేజ మాట్లాడుతూ గిరిజన ప్రాంత నిరుద్యోగులకు ఈ జాబ్ మేళా ఒక వరమన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు జాబ్ మేళా ప్రారంభమవుతుందని, సుమారు 1600 మందికి ఉపాధి కల్పించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీడాఫ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ధరణి జయహోను విజయవంతం చేద్దాం



ధరణి జయహో కరపత్రం విడుదల చేసిన ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం: ఇంటింటికీ మొక్క, ఊరంతా వనం అనే నినాదంతో నిర్వహించే ధరణి జయహో కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెంలో ధరణీ జయహో నృత్య ప్రదర్శన కార్యక్రమ కరపత్రాన్ని సోమవారం ఆయన విడుదల చేసి మాట్లాడారు. ప్రకృతి పరిరక్షణకు కాంక్రీట్ జంగిల్ వంటి పట్టణాల్లో సైతం పచ్చదనం నింపేందుకు ప్రజా కళాకారుడు, జానపద కళారత్న ఎల్ఆర్ కృష్ణబాబు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. సుమారు 3,333 మంది విద్యార్థులతో ధరణి జయహో నృత్య ప్రదర్శనకు జంగారెడ్డిగూడెం వేదిక కాబోతుండటం సంతోషంగా ఉందని చెప్పారు. ఎల్ఆర్ కృష్ణబాబు మాట్లాడుతూ విద్యార్థులకు నృత్య శిక్షణ అనంతరం ప్రదర్శన తేదీని తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు, పార్టీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య, సీఐ పి.రాజేష్, అభ్యుదయవాది అలుగు ఆనందశేఖర్, సుబ్బారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, నాయకులు బత్తిన చిన్న, ఎల్.వెంకటేశ్వర్లు, సంకు సురేష్, నౌడు అశోక్, చింతకాయల అచ్చిరాజు, దొంగల అజయ్ కుమార్, నూకవరపు సత్యనారాయణ, కిషోర్, అశోక్, షేక్ అక్బర్, చిప్పాడ వెంకన్న, మీసాల రెడ్డి, గూడపాటి రాధాకృష్ణ పాల్గొన్నారు.

గోపీనాథపట్నంకు శ్రీవారి ధర్మప్రచార రథం



లక్ష్మీపురం ఆలయం వద్ద రథానికి కొబ్బరికాయ కొడుతున్న అర్చకుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి ధర్మప్రచార రథం క్షేత్రం నుంచి ఉంగుటూరు మండలం గోపీనాథపట్నంకు సోమవారం తరలివెళ్లింది. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అర్చకులు ఆలయం నుంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ అట్టహాసంగా తీసుకెళ్లి, తూర్పు ప్రాంతంలోని జంటగోపురాల వద్ద ఉన్న ధర్మప్రచార రథంలో వేంచేపు చేశారు. అనంతరం రథం లక్ష్మీపురంలో సంతాన వేణుగోపాల జగన్నాథ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్దకు చేరింది. అక్కడి నుంచి గోపీనాథపట్నంకు పయనమైంది. ఈనెల 27 నుంచి వచ్చేనెల 1 వరకు అక్కడ నిర్వహించే ఆంజనేయ స్వామివారి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాల్లో రథం ఉంటుందని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. ఆ ప్రాంత ప్రజలు శ్రీవారు, అమ్మవార్లను దర్శించి, తరించాలని ఆయన కోరారు.

ఘనంగా అక్షింతల కలశాల శోభాయాత్ర



బుట్టాయగూడెంలో నిర్వహిస్తున్న శోభాయాత్ర

బుట్టాయగూడెం: అయోధ్య నుంచి వచ్చిన బాల రాముని అక్షింతలు, కలశాల శోభాయాత్ర విశ్వహిందూ పరిషత్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం బుట్టాయగూడెంలో ఘనంగా నిర్వహించారు. ఈ యాత్ర కొమ్ముగూడెం కుమ్మరిగట్టు వద్ద ఉన్న విజయ గణపతి ఆలయం నుంచి ప్రారంభమైంది. భక్తులు అక్షింతల కలశాలను తలపై పెట్టుకుని అభయాంజనేయ స్వామి ఆలయం, త్రిశక్తిపీఠం, కొత్తపేట సమీపంలో ఉన్న నందగోకుల రాధాకృష్ణుని ఆలయానికి చేర్చారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు కొండేపాటి రామకృష్ణ మాట్లాడుతూ అక్షింతల కలశాలను గ్రామంలోని ప్రతి ఆలయంలో మూడు రోజుల పాటు ఉంచి ప్రత్యేక పూజలు చేస్తామని తెలిపారు. అనంతరం ప్రతి గ్రామానికి ఇంటింటికీ సీతారాముల ప్రతిమ, అక్షింతలను వితరణ చేస్తామన్నారు. ఈ యాత్ర సీతారామలక్ష్మణ హనుమత్ సమేత వేషధారణతో మంగళవాయిద్యాల నడుమ జరిగింది. కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చ జిల్లా అధ్యక్షురాలు వంకా కాంచనమా, భక్తులు సోము హరినారాయణ, భౌమరాజు ధనుంజయరాజు, కొండపల్లి వీర్రాజు, సొర్న పుణ్యలక్ష్మి, కూచిపూడి రమేష్ చౌదరి, కూచిపూడి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరుకు అయోధ్య రాముడి అక్షింతలు

కుక్కునూరు: అయోధ్య రాముడి అక్షింతలను సోమవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం నుంచి కుక్కునూరు తీసుకొచ్చారు. వాటిని కొర్లకుంట రామాలయంలో ఉంచారు. ఈ అక్షింతలను మండలంలోని అన్ని గ్రామాల్లో పంచనున్నట్టు విశ్వహిందూ పరిషత్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో బొల్లు ప్రసాద్, తూము వెంకటేశ్వరావు, ముప్పాళ్ల శివయ్య, కుంజా వెంకటనర్సయ్య, ములిశెట్టి యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మాధవరంలో బాలరాజు పర్యటన

కుక్కునూరు: మండలంలోని మాధవరం సచివాలయ పరిధిలో పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మంగళవారం పల్లెకుపోదాం, గడపగడపకు మన ప్రభుత్వం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాల్లో పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు తెలిపారు. మండలంలోని పార్టీ శ్రేణులు, జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులంతా పాల్గొనాలని కోరారు.

విద్యార్థి కమలేష్ మృతిపై విచారణ చేయాలి



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): ఇటీవల పెదవేగి గురుకుల పాఠశాలలో అనుమానాస్పదంగా మృతి చెందిన విద్యార్థి దాసి కమలేష్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని, దీనికి బాధ్యులైన ప్రిన్సిపాల్, వార్డెన్‌లను తక్షణం సస్పెండ్ చేయాలని కోరుతూ ఏలూరు కలెక్టరేట్ వద్ద విద్యార్థి కుటుంబ సభ్యులు, దళిత సంఘాల నాయకులు సోమవారం ధర్నా చేశారు. స్పందనలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు దాసి వెంకటేశ్వరరావు, రూతి మాట్లాడారు. ఈనెల 20వ తేదీ రాత్రి 10.30 గంటలకు తమ కుమారుడు కమలేష్ పాఠశాల ఆవరణలో అనుమానాస్పదంగా మృతి చెందితే రాత్రి 12.30 గంటలకు తమకు సమాచారం ఇచ్చారని చెప్పారు. తాము వచ్చే టప్పటికే మృతదేహాన్ని మార్చురీకి తరలించారని, తాము చూసేందుకు అనుమతించకపోవడం పలు అనుమానాలకు తావిచ్చిందని తెలిపారు. పాఠశాల సిబ్బంది పొంతన లేని సమాధానాలు చెప్పారని ఆరోపించారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ఆలగా రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థి కమలేష్ మృతికి బాధ్యులైన ప్రిన్సిపాల్, వార్డెన్‌లను తక్షణం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు.